## క్లుప్తంగా

### అన్ని దానాల్లో అన్నదానం గొప్పది

వెంకటాపురం(కె): అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని వెంకటాపురం సీఐ బండారి కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శివాలయంలో ఉన్న సాయిబాబా ఆయంలో నిర్వహించిన కార్యక్రమాని ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాయిబాబా ఆలయంలో సంవత్సర కాలంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం మంచి కార్యక్రమం అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాతలను శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, ఎస్సై కొప్పుల తిరుపతి రెడ్డి, నాయకులు సయ్యద్ హుస్సేన్, గంపా రాంబాబు,తోట మల్లికార్జున రావు, లక్ష్మణరావు, శాంతమూర్తి, కలకోట సంతోష్ తదితరులు ఉన్నారు.

### ఎస్సైల బదిలీ

ఏటూరునాగారం/వాజేడు: వాజేడు ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎస్ రాజ్‌కుమార్ ఏటురునాగారానికి బదిలీ అయ్యారు. ఏటూరునాగారంలో ఎస్సైగా పనిచేస్తున్న తాజొద్దీన్‌ను భూపాలపల్లి ఎస్పీకి అటాచ్ చేసినట్లు సమాచారం. ఉన్నట్టు ఉండి ఎస్సై తాజొద్దీన్ ఎందుకు బదిలీ చేశారని మండలంలో చర్చించుకుంటున్నారు. అలాగే వెంకటాపూర్‌లో ఎస్సైగా పని చేస్తున్న సతీష్ వాజేడుకు బదిలీపై రానున్నట్లు తెలిసింది.

### కులమతాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

వాజేడు: మండల పరిధిలోని సుందరయ్య కాలనీలో గురువారం కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కుల మతాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇందిరా క్రాంతి పథకం సీసీ సత్యనారాయణ హాజరై మాట్లాడారు. కులం, మతంతో వస్తున్న కష్టాలు, నష్టాలు, వివక్షలపై వివరించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కల్సి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ కామేశ్, యాని మేటర్ రమాదేవి, ప్రసాద్, స్వరూప తదితరులు ఉన్నారు.

### రెవెన్యూ సదస్సు



ఏడ్జెర్లపల్లిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సు

వాజేడు: మండల పరిధిలోని ఏడ్జెర్లపల్లి, అయ్యావారిపేట గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఏడ్జెర్లపల్లి రెవెన్యూ సదస్సుకు ఎస్సై రాజ్‌కుమార్ తమ సిబ్బందితో భద్రత కల్పించారు. ఏడ్జెర్లపల్లిలో తహసీల్దార్ శ్రీనివాస్, అయ్యావారిపేట గ్రామంలో డీటీ సత్యనారాయణ, ఆర్ఐ కుమార స్వామి రెవెన్యూ సదస్సులను నిర్వహించారు.

### సినారెకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఉపన్యాసకులు

వాజేడు: మండల కేంద్రంలోని స్థానిక జూనియర్ కళాశాలలో తెలంగాణ తెలుగు సాయిత్య మహనీయుడు సి నారాయణరెడ్డి వర్ధంతిని గురువారం నిర్వహించారు. సినారె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల తెలుగు ఉపన్యాసకుడు, రచయిత, డాక్టర్ అమ్మిన శ్రీనివాస రాజౌ మాట్లాడుతూ.. సినారె సాహిత్యంలోని మానవీయ కోనంలోని మానవతా విలువలను గుర్తు చేశారు. కళాశాల ఉపన్యాసకులు శ్రీనయ్య, అవంతి, నరసింగరావు, ఆదిలక్ష్మి, బి రాజు, కె రాజు, కుమార స్వామి, కాంతారావు, కృష్ణ వేణి ఉన్నారు.

# సమస్యలతోనే పునఃప్రారంభం



రంగరాజాపురంలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం



శిథిలావస్థకు చేరిన బెస్తగూడెం పాఠశాల భవనం

- శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాలల భవనాలు
- పట్టించుకోని అధికారులు

వెంకటాపురం(కె): మండలంలోని సర్కారు బడులు సమస్యలతోనే గురువారం పునఃప్రారంభమయ్యాయి. మండలంలో మూడు ఆశ్రమ పాఠశాలలు, ఒకటి కస్తూరిబాగాంధీ పాఠశాల కలుపుకోని మొత్తం 60 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 4308 మంది విద్యార్థులు విద్యాను అభ్యసిస్తున్నారు. కాగా, మండలంలోని వీఆర్‌కేపురం పాఠశాల, బెస్తగూడెం పాఠశాల, మహితాపురం పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. నూతన భవనాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేక పోవడంతో వరండాల్లో విద్యార్థులను కూర్చోబెట్టి ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. మండలంలో మంజూరైన అమ్మ ఆదర్శ పాఠశాలలు సైతం పనులు అసంపూర్తిగా ఉండడంతో విద్యార్థులకు అవస్థలు తప్పటం లేదు. కాగా, చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాల–2లో పాత భవనం శిథిలావస్థకు చేరుకోవటంతో స్లాబ్‌పై పెచ్చులు ఊడి పడతున్నాయి. కొత్తగా నిర్మించిన ఆశ్రమ పాఠశాలలో పనులు పూర్తి కాలేదు. కొత్త భవనంలో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయలేదు. కాగా మండలంలోని 14 పాఠశాలకు చుట్టూ ప్రహరీ లేదు, 10 స్కూళ్లల్లో మరుగుదొడ్ల సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల్లో ఉన్న సమస్యలను అధికారులు పట్టించుకోవటం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. ఇప్పటికైనా అధికారులు పాఠశాలలో ఉన్న స మస్యలను పరిష్కరించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

### సమస్యలు పరిష్కరించాలి



చిరుతపల్లి బాలికల అశ్రమ పాఠశాలో ఉన్న సమస్యను అధికారులు పరిష్కరించాలి. శిథిలావస్థలో ఉన్న భవనం నుంచి కొత్త భవనంలోకి విద్యార్థుల తరగతి గదులు, హాస్టల్‌లో వసతి ఏర్పాటు చేయాలి.

– చేలే నవీన్, చిరుతపల్లి

# పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- మంత్రి సీతక్క

ఏటూరునాగారం: కాంగ్రెస్ పార్టీ బలోపేతం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి సీతక్క అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీ శ్రీనివాస కల్యాణ మండపంలో నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం పనిచేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారాధిగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. ప్రజాక్షేత్రంలో నిత్యం ఉంటూ ప్రజల సమస్యలను తీర్చాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే ఐక్యంగా కూర్చొని చర్చించుకొని తీర్చుకోవాలని కోరారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రవీచంద్ర, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, బ్లాక్ అధ్యక్షుడు వెంకన్న, రఘు, దేవేందర్, ఎల్లయ్య, లాలయ్య, గౌస్ పాల్గొన్నారు.

# గ్రామాల్లో వైద్యశిబిరాలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

వాజేడు: మండల పరిధిలోని మొరుమూరు గ్రామ పంచాయతీలోని పలు గ్రామాల్లో గురువారం ప్రగళ్లపల్లి పల్లె దావాఖాన వైద్యాధికారిని గ్నానస వైద్య శిబిరాలను నిర్వహించారు. కలెక్టర్ దివాకర, జిల్లా వైద్యాధికారి గోపాలరావు ఆదేశాల మేరకు ఈ వైద్య శిబిరాలను నిర్వహించినట్లు తెలిపారు. రోగులను పరీక్షించి మందులను అందించడంతో పాతు పలు సూచనలను చేశారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ లాంటి విష జ్వరాలు రాకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్రామాల్లో తిరుగుతూ జ్వరాల తీవ్రత తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో కోటిరెడ్డి, శ్రీనివాసరావు, కన్యాకుమారి, అరుణ, సరిత, రమణమ్మ, అక్కమ్మ తదితరులు ఉన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

మంగపేట: ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా ప్రవేశపెట్టిన ఆలయాల్లోని రెగ్యులర్ అర్చకులకు ఉద్యోగుల సంక్షేమ నిధి ట్రస్ట్ పథకం ప్రకటించడంపై జిల్లా డీడీఎస్ అర్చకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం చేశారు. విస్సావజ్ఝల నరేష్‌శర్మ, సౌమిత్రి వేణుగోపాలాచార్యులు, అనిపెద్ది నాగేశ్వర్‌రావుశర్మ, మురళీమోహన్‌శర్మ, బెల్లంకొండ ఈశ్వరానందశర్మ, జీడికంటి మధుసూదనాచార్యులు, మారెళ్లపుడి సతీష్‌శర్మ, గాదె నరేష్ చారి తదితరులు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

# ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని వినతి

వాజేడు: అంగన్‌వాడీ సిబ్బంది, ఆశకార్యకర్తలు తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్, మాజీ జెడ్పీటీసీ తల్లడి పుష్పలతలతో కలిసి గురువారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడికి వినతిపత్రం అ ందజేశారు. ఈ సందర్భంగా విక్రాంత్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న వారితో పాటు ఆశలు కూడా నిరుపేదలేనని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న సిబ్బంది

# పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలి



టేకుమట్ల: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



కాటారంలో..

టేకుమట్ల: పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని అంగన్‌వాడీ టీచర్లు ఈర్ల పూర్ణిమ, పెండెం హేమలత, ఈర్ల రజిత అన్నారు. గురువారం మండలంలోని రామకిష్టాపూర్(వి)లో అమ్మ మాట–అంగన్‌వాడీ బాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి వారి భవిష్యత్‌కు బంగారు బాటను వేయాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారంతో పాటు, ప్రీ ప్రైమరీ విద్యాభ్యాసం, ఆటలు వంటిని నేర్పిస్తారని అన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలకు ప్రతీ రోజు పౌష్టికాహారాన్ని అందిస్తారని తెలిపారు. చిన్న పిల్లల తల్లులు, గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కుడికాల శ్రీనివాస్, శనిగరపు రాజమోహన్, ములుకనూరి రాజన్న, అంగన్‌వాడీ ఆయాలు సారమ్మ, రజినీ, సునీత, తల్లులు తదితరులు ఉన్నారు.

మహదేవపూర్‌లో..

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కేంద్రంతో పాటు పలుగుల తదితర గ్రామాల్లో అమ్మమాట–అంగన్‌వాడీ బాట అనే కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో వేర్వేరుగా నిర్వహించారు. గురువారం మహదేవపూర్‌లో సూపర్‌వైజర్ నాగరాణి మాట్లాడుతూ.. రెండున్నర సంవత్సరాల పిల్లల నుంచి ఐదు సంవత్సరాల పిల్లలవరకు అంగన్‌వాడీల్లో చేర్పించాలనాన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సునీత, పలుగు–2 టీచర్ ఉమామహేశ్వరీలు పాల్గొన్నారు.

కాటారం: అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లల బంగారు భవిష్యత్‌కు పునాదులు వేయడానికి ఎంతగానో దోహదపడుతాయని ఐసీడీఎస్ కాటారం సెక్టార్ సూపర్‌వైజర్ శివరాణి, గంగారం సెక్టార్ సూపర్‌వైజర్ వీణ అన్నారు. మండల కేంద్రంతో పాటు గంగారం , అల్లీపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలపై అవగాహన కల్పించారు. ఎన్జీఓ కోఆర్డినేటర్ సమ్మయ్య, అంగన్‌డీ టీచర్లు శ్రీలతరెడ్డి, విమల, శ్యామల, ప్రేమలత, కృష్ణవేణి, సులోచన, పుష్పలత, సునీత, కిశోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

# చదువుతోనే అత్యున్నత స్థానం



మంగపేట: విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ మేనక





వాజేడు: దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న అధికారులు

- ఓపెన్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ సోమారెడ్డి



గోవిందరావుపేట: పుస్తకాలు పంపిణీ చేస్తున్న సోమారెడ్డి, పాణిని

గోవిందరావుపేట: భవిష్యత్‌లో పిల్లలు అత్యున్నత స్థాయికి చేరాలంటే చదువు ఒక్కటే మార్గమని రాష్ట్ర పరిశీలకులు, ఓపెన్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ సోమారెడ్డి అన్నారు. మండల పరిధిలోని పస్రా నాగారంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమారెడ్డి గురువారం ఆకస్మికంగా సందర్శించి పాఠశాల తరగతుల నిర్వహణను పరిశీలించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులకు విద్యాలక్ష్యాలు సాధించడానికి తగిన సూచనలు చేశారు. జిల్లా విద్యాధికారి పాణినితో కలిసి విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు, నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వన్నాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు సమ్మేశ్వరరావు, జ్యోతి, సమ్మయ్య, జయశ్రీ, షేక్ హాజీ, హేమలత, కనకయ్య, రాజయ్య, శారద, చంద్రారెడ్డి, లక్ష్మీ, శేఖర్, నరేందర్, వెంకటేష్, రామరాజు, ఝాన్సీ, భిక్షపతి, సంజీవ పాల్గొన్నారు.

విద్యార్థుల నమోదును పెంచాలి

వాజేడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్, జిల్లా విద్యాశాఖ సమన్వయకులు అర్షం రాజు, గుళ్ల పెల్లి సాంబయ్య గురువరాం పుస్తకాలు, దుస్తులను పంపిణీ చేశారు. గురువారం మండలానికి వచ్చిన అధికారులు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడుతో కలిసి వాజేడు ఉన్నత పాఠశాల పరిసరాలను, వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలన్నారు. మల్లయ్య, వెంకట రమణ, ఆనంద్, రవికుమార్, శ్రీకాంత్, కుమార్ బాబు, ప్రభాకర్, రాజ్య లక్ష్మి, రాజేష్, శ్రీరంగం, అమ్మాజీరాణి, వస్య తదితరులు ఉన్నారు.

పాఠశాలలు పునఃప్రారంభం

మంగపేట: వేసవి సెలవులు ముగియడంతో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు ప్రభుత్వ గిరిజన బాలుర, బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, కస్తూరిబా గాంధీ, గిరిజన ప్రైమరీ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు ఎంఈఓ పాదెం మేనక యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్లతో సమావేశాన్ని ఏర్పాటు చేసి పాఠశాలల్లో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.



కన్నాయిగూడెంలో..

కన్నాయిగూడెం: మండలంలో పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. పాఠశాలలు మొదటి రోజు కావడంతో విద్యార్థులు కొంతమంది మాత్రమే హాజరయ్యారు. రేపటి నుంచి విద్యార్థుల శాతం పెరగవచ్చని ఉపధ్యాయులు తెలుపుతున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పాఠ్యపుస్తకాలు అందించారు.

### దోమల నివారణ మందు పిచికారీ



పిచికారీ చేస్తున్న సిబ్బంది

కన్నాయిగూడెం: మండల పరిధిలలోని లక్ష్మీపురం, గంగూగెంలో గురువారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో దోమల నివారణ మందును పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి నరసింహారావు, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్ రావుతో పాటు తదితరులు ఉన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని పంబపూర్ గ్రామానికి చెందిన నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పాదెం వీరయ్య గురువారం పరామర్శించారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి వెంట మాజీ జెడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి, మేడారం జాతర మాజీ చైర్మన్ నాలి కన యయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ లాలయ్య, బీఆర్ఎస్ పార్టీ మహిళా మండల అధ్యక్షురాలు నాగమ్మ, నాయకులు సాయిరి లక్ష్మినర్సయ్య, సారయ్య ఉన్నారు.



పరామర్శిస్తున్న పాదెం వీరయ్య, నాగజ్యోతి

### దరఖాస్తుల ఆహ్వానం

కాటారం: మండలంలోని గంగారం తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో భాగంగా హవర్లీ బేసిడ్ పద్ధతిన బోధించుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గోవర్ధన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీటీ జువాలజీ, మ్యాథ్స్, టీజీటీ ఇంగ్లీష్ సబ్జెక్ట్‌ల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్ట్‌లలో డిగ్రీ, పీజీ, బీఈడీ, టీజీటీ పూర్తి చేసిన వారు అర్హులని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 16న ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాఠశాలలో హాజరు కావాలని ఆయన సూచించారు.

# తారురోడ్డుకు మోక్షమెప్పుడో?

- అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

చిట్యాల: మండలంలోని చల్లగరిగ నుంచి రేగొండ మండలం కొడవటంచ వరకు మూడు కిలోమీటర్ల మేరకు గ్రామీణ ప్రాంతాల రోడ్డు మరమ్మతుల కోసం రూ.కోటి 70లక్షల నిధులతో తారు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఎనిమిది నెలల క్రితం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ మేరకు పనులను కాంట్రాక్టర్ ప్రారంభించి కంకర, చూర పోసి వదిలివేయడంతో రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా నిలిచి పోయింది. రోడ్డు వెంట వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు అనేక అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతుల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ధుమ్ము ధూళితో అనేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కంకర తెలిన రోడ్డుపై వాహనాలు వెళ్లుతుంటే అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తారు రోడ్డు నిర్మాణం చేపట్టేలా చూడాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.



చల్లగరిగ-కోడవటంచ గ్రామాల మధ్య ఉన్న కంకర రోడ్డు

### పోచమ్మ తల్లి విగ్రహానికి జలాభిషేకం

మొగుళ్లపల్లి: వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకుంటూ గురువారం మండల కేంద్రంలోని మహిళలు గ్రామ దేవత పోచమ్మ తల్లి విగ్రహానికి జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభమైన వర్షాలు సరిగా కురువకపోవడంతో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకుంటూ జలాభిషేకం నిర్వహించినట్లు తెలిపారు.



జలాభిషేకం చేసిన మహిళలు